శ్రీ వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్‌కి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

రాజేంద్రనగర్: ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముద్దం శ్రీనివాస్‌గౌడ్‌కు వృక్ష శాస్త్ర (బోటనీ) విభాగంలో (పీహెచ్‌డీ) ప్రదానం చేసింది. పీహెచ్‌డీ పట్టాను ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణ్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌కు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సన్మానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌కు చెందిన మురళి ఏఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో చిన్ననాటి స్నేహితులు శుక్రవారం ఉదయం రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం మురళి నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నారు. ఏఎస్‌ఐగా పదోన్నతి రావడం పట్ల స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్నేహితులు వనం నరసింహా, పి.శ్రీనివాస్, కె.మురళీకృష్ణ, కె.రామకృష్ణ రాజు, బి.మధుసూదన్, పి.రామచంద్రుడు, పి.రమేశ్, ఎస్.రాజ్‌కుమార్, అంతిరెడ్డి, జి.శ్రీనివాస్, శేఖర్, సుగుణాకర్, పి.రాజు, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై నడిచేదెలా?



వంతెనపై పగిలి పోయిన పలకలు

అత్తాపూర్: అత్తాపూర్ బ్రిడ్జి నిర్వహణ అధ్వానంగా తయారైంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన ఈ వంతెనకు మరమ్మతులు చేసే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జికి ఒక వైపు పాదచారులు నడిచేందుకు వీలుగా చిన్న ఫుట్‌పాత్ నిర్మించారు. ఈ మార్గంలో సిమెంటు పలకలు ఒకొక్కటిగా విరిగిపోయాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో పాదచారులు నడవడానికి ఇబ్బందికరంగా మారింది. సంబంధిత ఉన్నతాధికారులు ఇకనైనా చిత్తశుద్ధితో వ్యవహరించి వంతెనపై విరిగిపోయిన పలకల స్థానంలో కొత్తవి వేసి సమసపరిష్కారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్మశాన వాటికలో వసతులు కల్పిస్తాం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి శ్మశాన వాటికను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు శుక్రవారం పరిశీలించారు. శ్మశాన వాటికలో వెయింటింగ్ హాల్, బర్నింగ్ ప్లాట్‌ఫామ్ తదితర పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధికారులకు ఆదేశించడంతో అధికారులు పరిశీలించారు. శ్మశాన వాటిక చుట్టు ప్రహరీ, స్నానపు గదులు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బొక్క ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు విజయ్ పాల్ రెడ్డిలు మాట్లాడుతూ... శ్మశాన వాటికలో మెరుగైన వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కృషి చేస్తున్నారన్నారు.

ఓబీసీ కులగణన చేయాలి

రాయదుర్గం: దేశవ్యాప్తంగా వెంటనే ఓబీసీ కులగణన చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కన్వీనర్ భూంపల్లి రవితేజ డిమాండ్ చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ ప్రధాన ద్వారం సమీపంలో బాంసెఫ్, రాష్ట్రీయ మూల్‌నివాసి సంఘ్ 12వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. కామారెడ్డిలో జరగనున్న సభలకు విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, మేధావులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కన్వీనర్ పెరిక అలెక్స్, హెచ్‌సీయూ విద్యార్థి నాయకులు శశాంక్, ప్రభాస్, గణేష్, నిరాజ్, చేతన్, సురేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు

గణేశ్ మండపాల ముస్తాబు!

- గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం
- 1800లకు పైగా మండపాల నిర్మాణం



వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు గణనాథుడి మండపాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఉత్సవ కమిటీల నిర్వాహకులు మండపాల నిర్మాణాన్ని ముమ్మరం చేయడంతోపాటు ఆయా మండపాలల్లో భక్తులకు అన్ని హంగులు కల్పిస్తూ నేత్రపర్వంగా అలంకరిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఆయా ప్రాంతాల్లో కమిటీ సభ్యులు తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేసి గణనాథులను ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో మండపాల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున పనులను చేపడుతున్నారు. ఇప్పటికే కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు తదితర ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి.

- కొన్ని ప్రాంతాల్లో శాశ్వత మండపాలు ఉండగా.. లేని ప్రాంతాల్లో తాత్కాలికంగా మండపాలను నిర్మిస్తున్నారు.
- మండపాలను వివిధ ఆకారాలలో తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం వివిధ ప్రాంతాల నుంచి కళాకారులను రప్పించారు. పోటీపడి మరీ మండపాలను ముస్తాబు చేస్తున్నారు.
- రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండల పరిధిలో 1800లకు పైగా మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. గత సంవత్సరం రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,005, శంషాబాద్ మండల పరిధిలో 400, గండిపేట్ మండల పరిధిలో 415 మండపాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొత్తగా కాలనీలు, బస్తీలు ఏర్పడటంతో మరిన్ని మండపాలు పెరగనున్నాయి.

నిర్వాహకులతో పోలీసుల సమావేశాలు...

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండపాల నిర్వాహకులతో పోలీసులు ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే శంషాబాద్ ఆర్‌జీఐ, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, నార్సింగ్ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆయా సమావేశాల్లో మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. అనుమతులు తదితర వాటిపై ప్రత్యేకంగా సిబ్బంది మండపాల నిర్వాహకుల వద్దకు వెళ్లి తగు సూచనలు చేస్తున్నారు.

మార్కండేయనగర్ మండప పూజలు

మైలార్‌దేవ్‌పల్లి: మార్కండేయనగర్ గణేశ్ మండపం ఆవరణలో గణేశ్ మండప పూజలను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా గణనాథుడికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తామని మండప నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రావుల నవీన్ తెలిపారు. నేతలు గద్దె కృష్ణ, పగిడిమర్రి సూర్యనారాయణ, ఏర్వ సత్యనారాయణ, కోట శ్యామ్, వర్కల చందు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మార్కండేయనగర్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి



నివాళులర్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

బండ్లగూడ: రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీజీపీఏ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి 7వ నిజాం కాలంలో హైదరాబాద్ కొత్వాల్‌గా దాదాపు 14 సంవత్సరాలు పని చేసి మతసామరస్యానికి కృషి చేశారన్నారు. కొత్వాల్‌గా ఉంటూనే బల్దియాలో సభ్యుడుగా ఉండి ఆనాడే స్ట్రీట్ లైట్స్ వేయించడం, వీధులు శుభ్రం చేయించడం, పీస్ కమిటీలు ఏర్పాటు చేసి తమ సామరస్యాన్ని కాపాడారని గుర్తుచేశారు. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డిని నేటి పోలీసులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. రాజా బహదూర్ కుటుంబ సభ్యులు, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి, కె.ఆర్.కె.ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకటరావు, వి.శ్రీనివాసరావు, భరత్, పీసీవి రమణ, డీఎస్‌పీలు సతీష్‌కుమార్, ఆదూరి శ్రీనివాసరావు, ఎస్.రామరావు, సి.హెచ్. దేవారెడ్డి, ఆర్‌ఐలు శ్రీనివాస్, ఫణేంద్రరెడ్డి, బి.మహేష్, శంకర్, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు విద్యుత్ కనెక్షన్‌లు తీసుకోవాలి

మణికొండ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న వారు ఆయా మండపాలకు అధికారికంగా విద్యుత్ కనెక్షన్‌లు తీసుకోవాలని మణికొండ ఏఈ సంతోష్ కుమార్ తెలిపారు. మండపానికి వాడే విద్యుత్ లోడును బట్టి కనెక్షన్ చార్జీలు ఉంటాయన్నారు. ఆ మొత్తానికి సంబంధించి డీడీ తీసి విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విగ్రహం ఎత్తు, నెలకొల్పే తేదీ, నిమజ్జనం తేదీ, నిమజ్జనం రూటు, నిర్వాహకుల పేరు, ఫోన్ నెంబర్ వివరాలను నమోదు చేయాలన్నారు. పోలీసు శాఖ ఇచ్చిన అనుమతి పత్రాలను దానికి జత చేయాలన్నారు. అధికారికంగా కనెక్షన్‌లు తీసుకోని వారిపై చర్యలు తప్పవన్నారు.


రోడ్ల ఆక్రమణలను సహించం



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మణికొండ: రోడ్ల పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, అలాంటి వాటిని తొలగించటంతో పాటు వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు గిరిగిరి గడ్డ నుంచి నార్సింగికి వచ్చే ప్రధాన రోడ్డులో రోడ్లకు ఇరువైపులా వెలసిన షాపులు, డబ్బాలను శుక్రవారం ఆయన ఆదేశాలతో టీపీఓ మణిహారిక తమ సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పెరుగుతున్న ట్రాఫిక్‌తో నార్సింగిలో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్లను ఆక్రమించి మరింత ఇరుకుగా చేస్తే చూస్తు ఊరుకోమన్నారు. అలాంటి వాటిని వెంట వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన అన్ని రోడ్లలో ఆక్రమణలను తొలగించామని తెలిపారు.

ప్రమాదకరంగా బండరాళ్లు



సర్వీసు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బండరాళ్లు

మణికొండ: ఔటర్ సర్వీసు రోడ్డులో ప్రమాకరంగా మరిన్ని బండరాళ్లు ఉన్నాయని, వాటిని హెచ్‌ఎండీఏ, ఔటర్ రింగ్ రోడ్డు నిర్వాహకులు వెంటనే తొలగించి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలనే మంచిరేవుల రెవెన్యూ పరిధిలో పలు బండరాళ్లు భారీ వర్షాలతో ఔటర్ సర్వీసు రోడ్డులోకి జారి వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అటుగా ఎలాంటి వాహనాలు రాక పోవటంతో పెను ప్రమాదం తప్పిందని వారు గుర్తు చేస్తున్నారు. అదే తరహాలో సర్వీసు రోడ్డుపైకి వంగి మరిన్ని చోట్ల బండరాళ్లు ఉన్నాయని, వాటిని తొలగించాల్సిన అధికారులు మిన్నకుండిపోయారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటుగా ప్రయాణించాలంటే అవి ఎపుడు తమ వాహనాలపై పడతాయో అని బిక్కుబిక్కు మంటూ వెళ్తున్నామని వారు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పైకి జారే అవకాశం ఉన్న అన్ని రాళ్లను తొలగించాలని కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి: సీపీఐ



బురదమయంగా ఉన్న రోడ్డును పరిశీలించిన సీపీఐ నాయకులు

మణికొండ: డ్రైనేజీ, నీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు తవ్విన రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజలకు సౌకర్యంగా మార్చాలని సీపీఐ గండిపేట మండల కార్యదర్శి ఎస్. మల్లేష్ డిమాండ్ చేశారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల ఇందిరమ్మ కాలనీలో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు గతంలో డ్రైనేజీ పనులకు తవ్విన రోడ్డును మరమ్మతులు చేయకపోవటంతో బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ... అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని, లేదంటే కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. పార్టీమండల నేతలు శంకరయ్య, బాబురావు, శ్రీనివాస్, కాలనీ నేతలు సత్యం, మల్లేష్, నరసింహా, బాలయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



విద్యుత్ సమస్యలను పరిశీలిస్తున్న ఏఈ అమర్‌సింగ్

బండ్లగూడ: వర్షాల నేపథ్యంలో విద్యుత్ సమస్యలు, ప్రమాదాలకు కారణమవుతున్న వేలాడే విద్యుత్ తీగలను గుర్తించి వాటికి మరమ్మతు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని హిమాయత్‌సాగర్ ఏఈ అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, గంధంగూడలలో సందర్శించారు. ఎస్‌ఎంపీ స్కూల్ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసే పనులను ప్రారంభించారు. గంధంగూడ పరిధిలో వర్షాకాలం దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నెలకొన్న సమస్యలను సిబ్బందికి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్‌గౌడ్, రాంప్రసాద్‌రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌లో హైదరా‘బాద్‌షా’ తథ్యం!

- ఐసీఎన్ ఇండియా అధ్యక్షుడు జయ్ ఆచార్య
- నేచురల్ ఫిట్‌నెస్‌పై నగర యువత ఆసక్తి



జయ్ ఆచార్య, ఐసీఎన్ ఇండియా, యూఏఈ అధ్యక్షుడు,



పాల్గొనేందుకు సిద్ధమవుతున్న అథ్లెట్లు

శంషాబాద్: నేచురల్ ఫిట్‌నెస్ (సహజసిద్ధ శరీర దృఢత్వం)పై నగర యువతకు ఉన్న ఆసక్తిని పరిశీలిస్తుంటే ఫిట్‌నెస్‌కు భవిష్యత్తులో హైదరా‘బాద్‌షా’ కావడం ఖాయమని ఐసీఎన్ (ఐ కాంపిటీంట్ నేచురల్) ఫెడరేషన్ ఇండియా, యూఏఈ అధ్యక్షుడు, ప్రముఖ బాడీబిల్డర్ ఆస్ట్రేలియాకు చెందిన ప్రవాస భారతీయుడు జయ్ ఆచార్య ధీమా వ్యక్తం చేశారు. శంషాబాద్‌లో శని, ఆదివారాల్లో ‘డెక్కన్ అప్‌రైజింగ్ 2025’ టైటిల్‌తో జరిగే నేచురల్ ఫిట్‌నెస్ పోటీల సన్నాహక కార్యక్రమానికి హాజరైన ఆయన ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు.

వివిధ అంశాలు ఆయన మాటల్లోనే...

అథ్లెట్లు, క్రీడాకారులే కాకుండా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి. మత్తు కెరీర్‌తో పాటు జీవితాన్ని అగమ్యగోచరంలో నెట్టేస్తుంది. డ్రగ్స్ ఫ్రీ పోటీలను విస్తృతం చేసే లక్ష్యంతో ఐసీఎన్ ప్రత్యేకంగా నేచురల్‌ఫిట్‌నెస్ పోటీలను ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో నిర్వహిస్తోంది. ఇప్పటికే 30 వేల వరకు అథ్లెట్లు ఐసీఎన్ కుటుంబంతో కలిసి సహజసిద్ధమైన శరీరధృడత్వానికి ప్రాధాన్యనిస్తు భవిష్యత్తు క్రీడాకారులు, అథ్లెట్లకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

- హైదరాబాద్ రాక్ ప్రాంతంలో గతంలో నిర్వహించిన పోటీలు విజయవంతమయ్యాయి.

ప్రస్తుతం నిర్వహించనున్న పోటీలకు 950 అథ్లెట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. హైదరాబాద్ యువత ఫిట్‌నెస్ ఎంతో ఆసక్తితో ఉన్నారు. ఇండియాలోనే ఇది తమకు అతిపెద్ద ఈవెంట్ కానుంది. భవిష్యత్తులో కిడ్స్‌తో కూడా ఇలాంటి పోటీల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సహజసిద్ధమైనది ఏది కూడా త్వరగా పాడు కాదన్న విషయాన్ని యువత గ్రహిస్తే రియల్‌ఫిట్‌నెస్ ఇచ్చే లాభాలను జీవితకాలం అనుభవించవచ్చు.. ఆదివారం జరిగే తుది పోటీలకు హీరో అల్లు శిరీష్ హాజరుకానున్నారు అని ఆయన వివరించారు.

నేడు అన్నదానం

రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అమావాస్యను పురస్కరించుకొని ఆలయ ఆవరణలో సాయంత్రం 7 గంటలకు అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వివాహిత అదృశ్యం



భవిత ఠాకూర్ సింగ్

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కిశోర్ సమాచారం మేరకు... బుద్వేల్ శివసాయినగర్ ప్రాంతానికి చెందిన భవిత ఠాకూర్ సింగ్ (36), కృష్ణ సింగ్ దంపతులు. భవిత ఠాకూర్ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో భర్త కృష్ణసింగ్ బంధువు, మిత్రులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలు పొంగకుండా ప్రత్యేక చర్యలు

బండ్లగూడ: వర్షాకాలంలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ అవికాస్తా పొంగిపొర్లకుండా చూస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర పేర్కొన్నారు. కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 17వ డివిజన్‌లోని సాయిబాబా కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశలించి అవసరమైన సలహాలు, సూచనలు సూచించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబానగర్‌లో డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

దోమల నివారణకు ఫాగింగ్



శాస్త్రీపురంలో ఫాగింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది

శాస్త్రీపురం: వర్షాలు పడుతుండంతో బస్తీలలో దోమల బెడద ఎక్కువైంది. శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో సాయంత్రం అయితే చాలు దోమలు దండయాత్ర చేస్తున్నాయి. మిరాలం చెరువు ప్రాంతాల్లోని బస్తీలలో దోమల కారణంగా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇంద్రానగర్, హసన్‌నగర్, సులేమాన్‌నగర్, వాదియామహ్మద్, మహ్మద్‌నగర్, నౌనంబర్, చింతల్‌మెట్ ప్రాంతాల ప్రజలు రెండు మూడు రోజులుగా దోమల సమస్యను సబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అధికారులు దోమల నివారణ కోసం బస్తీలలో దోమల నివారణ మందు ఫాగింగ్‌ను ప్రారంభించారు.

పోస్టు కార్డు ఉద్యమం



సంతకాలు చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: భారతదేశంలో 2024 సాధారణ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌యూఐ) భారత రాష్ట్రపతిని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టింది.ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి ఆదేశాలపై రాష్ట్ర మాజీ కార్యదర్శి సునీల్‌కుమార్ శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమానికి భారీ మద్దతు లభించిందని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితేష్‌రావు, ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.